అంతా మా ఇష్టం

నగరంలో ఎక్కడపడితే అక్కడ అనధికార ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. ప్రధాన కూడళ్లతో పాటు ఆయా రోడ్ల పక్కన ప్రచార బోర్డులు, ఫ్లెక్సీలను విచ్చలవిడిగా ఏర్పాటు చేస్తున్నారు. వీటి కోసం కార్పొరేషన్ నుంచి ఎలాంటి అనుమతులు పొందకుండానే పని కానిస్తున్నారు. అధికార పార్టీ నాయకుల ఫ్లెక్సీలు కావడంతో ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

- నగరంలో ఇష్టారాజ్యంగా ఫ్లెక్సీల ఏర్పాటు
- అధికార పార్టీ నేతలకు ఒకలా.. విపక్షాలకు మరోలా నిబంధనలు
- అనధికార ఫ్లెక్సీలతో ఎన్ఎంసీ ఆదాయానికి గండి



విచ్చలవిడిగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

నెల్లూరు(బారకాసు): రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ నగరంలో అనధికారికంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తే వెంటనే తొలగించాలని కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. అనధికార ఫ్లెక్సీల జోలికి వెళ్లకపోవడం వెనుక ముడుపులు ముడుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా అధికార పార్టీ నాయకులకు చెందిన ఫ్లెక్సీలతో తమకెందుకు అని అధికారులు జంకుతున్నారు. వాటిని తొలగిస్తే ఎక్కడ తమ ఉద్యోగానికి ఇబ్బందులు వస్తాయోనన్న భయంతోనే మిన్నకుండిపోతున్నారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

విపక్షాలకే నిబంధనలు

నగరంలో విపక్షాల ఫ్లెక్సీలను కక్షగట్టి మరీ తొలగించేస్తున్నారు. ఉన్నా ఒకటి లేదా రెండు రోజులకు మించి ఉండనీయడం లేదు. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నేతలకు సంబంధించిన పుట్టినరోజుల సందర్భంగా అనధికారికంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను మాత్రం రోజుల తరబడి ఉంచినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

మామూళ్ల మత్తులో..

కొత్త షాపింగ్ మాల్ ప్రారంభోత్స సందర్భంగా నగరంలో ప్రచార నిమిత్తం అనధికారికంగా ఫ్లెక్సీల ఏర్పాటు జరుగుతోంది. వీటి ద్వారా నగరపాలక సంస్థకు రావాల్సిన ఆదాయం గండిపడుతోంది. అనధికార ఫ్లెక్సీల నుంచి మామూళ్ల రూపంలో టౌన్‌ప్లానింగ్ అధికారుల జేబుల్లోకి వెళ్తుండటంతో వాటి జోలికి వెళ్లకుండా చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా సంబంధిత టౌన్‌ప్లానింగ్ అధికారులు అనధికార ఫ్లెక్సీల ఏర్పాటుపై ప్రత్యేక నిఘా ఉంచి వాటిని తొలగించేలా చర్యలు తీసుకోవలని నగర ప్రజలు కోరుతున్నారు.

ఏదీ పారదర్శకత

నగరపాలక సంస్థ పరిధిలోని ప్రధాన రహదారులైన జీఎన్టీ రోడ్డు, మినీబైపాస్ రోడ్డులో 20కు పైగా హోర్డింగ్‌లు ఉన్నాయి. వీటిని 15 ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించారు. వాటి నుంచి ఏడాదికి రూ.1.50 కోట్ల వరకు ఆదాయం వస్తోంది. నగరం విస్తరిస్తున్న నేపథ్యంలో వీటి సంఖ్యను పెంచుకుంటే ఆదాయం పెరుగుతుంది. ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్న దాఖలాలు లేవు. నగరంలో ప్రధాన ప్రాంతాలైన ఆత్మకూరు బస్టాండ్, స్టోన్‌హౌస్‌పేట, ట్రంకురోడ్డు, గాంధీబొమ్మ సెంటర్, వీఆర్సీ కూడలి, మద్రాసు బస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్, కేవీఆర్ పెట్రోల్ బంక్ సెంటర్, కరెంటాఫీస్ సెంటర్, వేదాయపాళెం, అయ్యప్పగుడి, అన్నమయ్య సర్కిల్, బీవీనగర్ సెంటర్, వనంతోపు సెంటర్, ముత్తుకూరు బస్టాండ్ సెంటర్, పొదలకూరు రోడ్డు, మైపాడుగేట్ సెంటర్ తదితర ప్రాంతాల్లో అనధికారికంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. వాటివల్ల నగరపాలక సంస్థ ఆదాయానికి గండిపడుతోంది. అంతేకాకుండా ఫ్లెక్సీల వల్ల ప్రమాదాలతో పాటు శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతున్నాయని, అందువల్ల అనుమతి ఇవ్వకూడదని గతంలో అధికారులు నిర్ణయించారు. కొంత కాలంగా అధికార పార్టీ విషయంలో దీనిని పక్కన పెట్టారనే ఆరోపణలు వస్తున్నాయి.


మినీ బైపాస్‌రోడ్డు వెంబడి రోజుల తరబడి ఉన్న అధికార పార్టీ నేతల ఫ్లెక్సీలు

వైఎస్సార్‌సీపీ నేతకు పరామర్శ


వెంకటసుబ్బారెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : నగరంలోని 14వ డివిజన్ వైఎస్సార్‌సీపీ నాయకుడు నెల్లూరు వెంకటసుబ్బారెడ్డిని బాలాజీనగర్‌లోని ఆయన నివాసంలో పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. వెంకటసుబ్బారెడ్డి అనారోగ్యంతో బాధపడుతుండడంతో యోగక్షేమాల గురించి అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

మర్యాదపూర్వకంగా..


మంత్రి ఆనంకు పూలమొక్కను అందజేస్తున్న కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు) : ఎన్ఎంసీ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన వైఓ నందన్ రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలమొక్కను అందజేశారు.

క్లుప్తంగా

బీర్ బాటిల్‌తో తలపై దాడి

నెల్లూరు(క్రైమ్) : నెల్లూరు మన్సూర్‌నగర్‌కు చెందిన కొందరు మత్తులో బీర్‌బాటిల్‌తో మద్యం తాగుతున్న ఓ యువకుని తలపై దాడి చేశారు. మరో యువకుని మెడలోని బంగారు గొలుసును దోచుకెళ్లారు. ప్రాథమిక సమాచారం మేరకు.. కాగులపాడు ప్రాంతానికి చెందిన ప్రవీణ్ ఆదివారం తన స్నేహితులతో కలిసి మద్యం సేవించేందుకు రూరల్ మండలం దొడ్ల డెయిరీ సమీపంలోని మద్యం దుకాణానికి వెళ్లారు. మన్సూర్‌నగర్‌కు చెందిన యువకులు సైతం మద్యం తాగేందుకు అక్కడికి వెళ్లారు. మద్యం తాగే క్రమంలో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో మన్సూర్‌నగర్‌కు చెందిన యువకులు బీర్ బాటిల్‌తో ప్రవీణ్ తలపై బలంగా కొట్టడంతో తీవ్రగాయమైంది. మరో యువకుడిని చంపుతామని బెదిరించి బంగారు గొలుసును దోచుకెళ్లారు. గాయాలపాలైన ప్రవీణ్ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న నెల్లూరు రూరల్ పోలీసులు కేసు విచారిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియ రావాల్సి ఉంది.

చోరీలపై అప్రమత్తంగా ఉండాలి

పొదలకూరు: వేసవిలో చోరీలు జరిగే అవకాశం ఉన్న తరుణంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పొదలకూరు సీఐ శివరామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక సీఐ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. సెలవుల్లో ఊళ్లకెళ్లే వారు ముందస్తుగా తమకు సమాచారం అందించాలని కోరారు. అపరిచిత వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తుంటే వెంటనే తమకు తెలియజేయాలని చెప్పారు. రాత్రి వేళ పెట్రోలింగ్ చేస్తున్నామన్నారు.

ఉచితంగా ఖత్నాలు



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలోని షాదీమంజిల్‌లో ఉలామా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ముస్లింలకు ఉచితంగా ఖత్నాలు నిర్వహించారు. అనంతరం వారికి ఉచితంగా మందులు అందజేశారు. సామాజిక సేవలో భాగంగా తాము ఈ కార్యక్రమాన్ని చేపట్టామని నిర్వాహకుడు అబ్దుల్ హమీద్ తెలిపారు. వైద్యులు హమీద్, సమద్ నజీరి తదితరులు పాల్గొన్నారు.

5న ఇందుకూరుపేటలో..

ఇందుకూరుపేట : ఇందుకూరుపేట షాదీమంజిల్‌లో మే 5న ఉచిత ఖత్నాలు నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖత్నా చేయించిన చిన్నారులకు గోధుమ పిండి, రాగిపిండి, గుడ్లు, మందులను ఉచితంగా అందజేస్తామన్నారు. పరిసర ప్రాంత వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 89777 22178, 80192 05416 నంబర్లను సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

నీట్ ర్యాంకర్‌కు సన్మానం


హమీద్‌ను అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బుచ్చిరెడ్డిపాళెం పట్టణానికి చెందిన డాక్టర్ షాహుల్ హమీద్ నీట్ ప్రవేశ పరీక్షలో 69వ ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా ఆయన్ను వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు షాహుల్ ఆదివారం శాలువతో సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శుక్రవారం విడుదలైన నీట్ ఫలితాల్లో పట్టణానికి చెందిన హమీద్ జాతీయ స్థాయిలో 69వ ర్యాంక్ సాధించడం గర్వకారణమన్నారు. ఈ ఘన విజయానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదని అన్నారు. కార్యక్రమంలో ఖాస్మి, షామీర్, సలీం, వినయ్, జావిద్, తదితరులు పాల్గొన్నారు.

సందడే.. సందడి



తోటపల్లిగూడూరు: వేసవి సెలవులు.. మండుతున్న ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు గానూ కోడూరు తీరాన్ని పలువురు ఆదివారం ఆశ్రయించారు. దీంతో కోడూరులో సందడి నెలకొంది. పిల్లలు, యువత గంటల కొద్దీ సముద్ర స్నానాలతో ఆనందంగా గడిపారు. ఉదయం పది గంటలకు ప్రారంభమైన రాకపోకలు సాయంత్రం ఆరు వరకు కొనసాగాయి.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ రవి

నెల్లూరు(అర్బన్) : నగరంలోని 45వ డివిజన్ జేమ్స్ గార్డెన్‌లో డెల్టా స్పెషాలిటీ హాస్పిటల్ ఫౌండర్, పల్మనాలజిస్ట్ పోకల రవి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రభుత్వ పెద్దాస్పత్రి ఆర్థోపెడిక్ డాక్టర్ కె.భాస్కర్, జనరల్ మెడిసిన్ డాక్టర్ సునీల్, కార్డియాలజిస్ట్ బాలకృష్ణ, గైనకాలజిస్ట్ లావణ్యరెడ్డి వైద్యసేవలందించారు. ఈ సందర్భంగా పల్మనాలజిస్ట్ రవి మాట్లాడుతూ సొంత నిధులతో పేద ప్రజలకు వైద్యసేవలందించేందుకు తరచూ ఉచిత వైద్యశిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ శిబిరంలో ఆయాసం, నెమ్ము, అలర్జీ, వైరల్ ఫీవర్, కడుపులో మంట, పేగు పూత, కొలెస్ట్రాల్, కీళ్లు, నడుం నొప్పులు, వెన్నెముక, గర్భకోశ వ్యాధులు, సీపీఓడీ లాంటి పలు రకాల సమస్యలను పరీక్షించడంతో పాటు అవసరమైన రక్తపరీక్షలు, పల్మనాలజీ ఫంక్షనల్ టెస్ట్(పీఎఫ్‌టీ), ఈసీజీ లాంటి పరీక్షలను ఉచితంగానే చేసి మందులను పంపిణీ చేశామన్నారు. 300 మందికిపైగా రోగులకు సేవలందించామన్నారు. కార్యక్రమంలో జనసేన ప్రధాన కార్యదర్శి గునుకుల కిశోర్, ఏపీ కాట్కా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కమతం సుబ్బారావు, బలిజ సంక్షేమ నాయకుడు డాక్టర్ సుధామాదవ్, పాముూరు మధుసూదన్, మునిశేఖర్, అనిల్, నాగేశ్వరరావు, శ్రావణి, ప్రసాద్, కృష్ణారావు, మహేష్ పాల్గొన్నారు.

వైభవంగా అవతారోత్సవాలు



నెల్లూరు(బృందావనం) : రంగనాయకులపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో భగవద్రామానుజాచార్యుల వారి 1,008 అవతార మహోత్సవాలు విశేషంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ఆదివారం ఉదయం తిరుమంజనం, సాయంత్రం మంగళ శాసనోత్సవం, రాత్రి పేట ఉత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాలను దేవస్థానం ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

వాకర్స్‌కు వైద్యపరీక్షలు



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 300 మంది వాకర్స్‌కు షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, కార్యదర్శి రవిచంద్ర, కోశాధికారి జీకే గోపీనాథ్, రాఘవేంద్ర శెట్టి, డాక్టర్ సత్యనాథ్, కృష్ణమూర్తి, శ్రీధర్ రెడ్డి, చంద్రమౌళి, గఫార్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎంకు సన్మానం



నెల్లూరు (టౌన్) : దర్గామిట్టలోని మున్సిపల్ పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తూ పదవీ విరమణ పొందనున్న మచ్చ మల్లేశ్వరిని ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ మేరకు స్థానిక పాఠశాలలో మల్లేశ్వరి దంపతులను పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించి, ఆమె సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రిపబ్లిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఖాజా రహంతుల్లా, ప్రధాన కార్యదర్శి కోలా కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దాస్పత్రిలో సిబ్బంది దాష్టీకాలు



నెల్లూరు (అర్బన్): నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో కొంత మంది కింది స్థాయి సిబ్బంది దాష్టీకాలు రోజు రోజుకు మితిమీరుతున్నాయి. రోగులకు సహాయకులుగా వచ్చిన వారితో కొందరు, వారిలో వారు ఇంకొందరు దౌర్జన్యాలకు దిగుతున్నారు. శనివారం ఐపీ (ఇన్ పేషెంట్) బిల్డింగ్‌లో రెండో అంతస్తులో ఒక పేషెంట్ అడ్మిట్ అయ్యారు. ఆ పేషెంట్ సహాయకురాలు బాత్‌రూంలు బాగా లేవని అక్కడ పనిచేసే శానిటరీ సిబ్బందికి తెలిపింది. మరుసటి రోజు ఉదయం 7.20 గంటల సమయంలో ఆస్పత్రి బయట గేటు వద్ద ఆ మహిళను పలువురు శానిటరీ మహిళలు చుట్టు ముట్టి కొట్టేందుకు ప్రయత్నించారు. కొంత మంది గొడవను సద్దుమణిచారు. ఈ విషయమై ఆ మహిళ శానిటరీ సిబ్బంది రేవతితోపాటు మరికొంత మంది శానిటరీ మహిళలపై ఆస్పత్రిలోని తపాలా ద్వారా సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్‌కు ఫిర్యాదు చేసింది. అడ్మినిస్ట్రేషన్ అధికారి డాక్టర్ కళారాణికి కూడా ఫిర్యాదు చేసింది. ఇదిలా ఉంటే అంతకు ముందు రెండు రోజుల క్రితమే క్యాజువాలిటీ వద్ద ఒక రోగి వైద్యం కోసం వచ్చాడు. సహాయకుడికి, సెక్యూరిటీకి మాట తీరులో తేడా రావడంతో సెక్యూరిటీ ఆ సహాయకుడి చేతిపై కర్రతో కొట్టాడు. దీంతో అతనికి దెబ్బ తగిలింది. గత నెలలో సెక్యూరిటీకి, శానిటరీ సిబ్బంది మధ్య చిన్నపాటి సమస్యను ఆసరాగా చేసుకుని ఓ శానిటరీ మహిళ తన కుమారుడిని ఇంటి వద్ద నుంచి పిలిపించి మరో మహిళా సెక్యూరిటీపై చేయి చేసుకున్నారు. ఈ విషయంలో రెండు వర్గాలు ఏర్పడ్డాయి. విధులపై నిర్లక్ష్యం వహిస్తూ వారం రోజుల పాటు నిత్యం ఆస్పత్రిలో వాదోప వాదాలు జరిగేవి. అధికారులు సర్దుబాటు చేయలేక నానా ఇబ్బంది పడ్డారు. ఇలాంటి చర్యలు తరచూ ఆస్పత్రిలో జరుగుతున్నాయి. మరో దఫా ఇలాంటి ఘర్షణ వాతావరణం జరగకుండా అధికారులు తగు చర్యలు చేపట్టాలని, ఆస్పత్రిలో శానిటేషన్ మెరుగు పరిచేలా చూడాలని కోరుతున్నారు.

పిఠాపురం ఘటన సిగ్గుచేటు


మాట్లాడుతున్న మాల ఐక్యవేదిక జిల్లా నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రాతినిథ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గం మల్లాం గ్రామంలో మాల సామాజిక వర్గానికి చెందిన కుటుంబాలను కొందరు గ్రామ బహిష్కరణ చేయడం సిగ్గుచేటు అని మాల ఐక్యవేదిక జిల్లా నాయకులు అన్నారు. నగరంలోని మాల ఐక్యవేదిక కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో జిల్లా నాయకులు బాబు, విజయ్‌కుమార్ మాట్లాడుతూ, నేటి సమాజంలో కులాలు, మతాలను విడదీస్తూ, గ్రామ బహిష్కరణ చేయడం సరికాదన్నారు. ఈ ఘటనకు పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేసి మాలలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దోషులపై చట్టపరమైన చర్యలు తీసుకోని పక్షంలో మాలలంతా ఏకమై ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

పది రోజుల పాటు బైబిల్ పాఠశాల

నెల్లూరు(బృందావనం) : బాప్టిస్ట్ చర్చి డౌనీహాల్ ఆధ్వర్యంలో వేసవి బైబిల్ పాఠశాల(వీబీఎస్) సోమవారం నుంచి పదిరోజుల పాటు నిర్వహిస్తున్నట్లు చర్చి సెక్రటరీ గుర్రం అరుణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీఆర్సీ వద్దగల చర్చిలో ఉదయం 8 నుంచి 12 గంటల వరకు తరగతులు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల చిన్నారులు పాల్గొనవచ్చని వివరించారు.

పండుటాకులు లఘుచిత్రానికి అవార్డు



అవార్డు అందుకొంటున్న అనంత్, బెనర్జీ

నెల్లూరు(బృందావనం) : నెల్లూరీయులు నిర్మించిన లఘుచిత్రం 'పండుటాకులు'కు జ్యూరీ అవార్డు లభించింది. ఇందుకు సంబంధించి రచయిత, దర్శకుడు కళాంజలి అనంత్ మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాలకు సంబంధించి విజయవాడలో 'షార్ట్‌ఫిల్మ్ ఫెస్టివల్‌- 2025' పోటీలు ఆదివారం జరిగాయని, ఇందులో నిర్వాహకులు కేకేఆర్ మూర్తి, సాగర్‌లు అవార్డును అందజేశారన్నారు. కార్యక్రమంలో పార్వతీశం, దువ్వూరు బెనర్జీ, మునిచంద్ర, లహరి పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలలను కాపాడండి

కోవూరు : ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను కాపాడాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) జిల్లా అధ్యక్షుడు డేవిడ్ చిన్నబాబు అన్నారు. కోవూరు మండల కేంద్రంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్ల రాష్ట్రంలో ఏకోపాధ్యాయ పాఠశాలలు పెరిగిపోయే ప్రమాదం ఉందన్నారు. తరువాతి కాలంలో అవి కూడా మూతపడే స్థితి ఏర్పడుతుందన్నారు. ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలను కాపాడేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఫాసిస్ట్ విధానాన్ని అమలు చేస్తున్న బీజేపీ



ప్రసంగిస్తున్న అమితాబ్ చటర్జీ


సభకు హాజరైన ప్రజలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక, ఫాసిస్టు విధానాలను అమలు చేస్తోందని సోషలిస్టు యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా కమ్యూనిస్ట్(ఎస్‌యూసీఐ) పొలిట్ బ్యూరో సభ్యుడు అమితాబ్ చటర్జీ అన్నారు. నగరంలోని మినీ టౌన్‌హాల్లో ఆదివారం నిర్వహించిన ఎస్‌యూసీఐ 77వ సంస్థాపక సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశంలో బ్రిటీష్ పాలన తరువాత ప్రజా ప్రభుత్వం ఏర్పడి ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని ప్రజలు ఆకాంక్షించారని, అయితే స్వాతంత్ర్యం వచ్చిన తరువాత పెట్టుబడిదారీ వర్గం అధికారాన్ని చేపట్టి దోపిడీని కొనసాగిస్తోందని ఆరోపించారు. దీంతో ప్రజల సమస్యలు పెరుగుతూనే ఉన్నాయన్నారు. గతంలో కాంగ్రెస్, నేడు బీజేపీ ప్రభుత్వరంగ సంస్థలైన విద్య, వైద్య రంగాలతో పాటు అడవులు, గనులను ప్రైవేటుపరం చేస్తున్నారన్నారు. కొద్దిమంది పెట్టుబడీదారులకు అనుకూలంగా ప్రభుత్వాలు తమ పాలసీలు తీసుకొచ్చాయని ఆరోపించారు. కార్యక్రమంలో రాష్ట్ర, కేంద్ర కమిటీ నాయకులు బీఎస్ అమర్‌నాథ్, బసవరాజు, గోవిందరాజులు, సుధీర్, లలిత, ప్రమీల, రాఘవేంద్ర, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.